సాక్షి వికారాబాద్

ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024



కష్టాల సాగు

వ్యవసాయం భారంగా మారుతోంది. సాగు ఖర్చులు పెరిగిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



పని బారెడు..

ఆశ్రమ విద్యార్థులకు అన్నీ తామై విద్యాబుద్ధులు నేర్పి, అండగా నిలిచే ఉపాధ్యాయుల భవిష్యత్‌కు భద్రత లేదు. 8లో▸



తాళం వేసిన ఇళ్లే టార్గెట్

తాళం వేసిన ఇళ్లే అతడి టార్గెట్. ఇళ్లల్లోకి చొరబడి ఉన్నదంతా ఊడ్చుకెళ్లడం అతడి హాబీ! 8లో▸

న్యూస్‌రీల్

20న తాండూరుకు కేంద్ర మంత్రి రాక

తాండూరు టౌన్: ఈ నెల 20న తాండూరులో బీజేపీ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్న రాజరాజేశ్వరి బస్సు యాత్ర కార్యక్రమానికి కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా హాజరు కానున్నట్లు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు తాండూరు పట్టణంలోని ఇందిరా చౌక్‌లో రోడ్ షో, అనంతరం బస్సు యాత్రను కేంద్ర మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు రానున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కార్యక్రమానికి తరలిరావాలని ఆయన కోరారు.

ఆస్పత్రుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

- ఢిల్లీ వైద్యాధికారుల బృందం
- చౌడాపూర్ పల్లె దవాఖాన పరిశీలన



వైద్యాధికారులను సన్మానించిన డాక్టర్లు

కుల్కచర్ల: ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం కావాలని, ఆస్పత్రుల నిర్వహణలో నిర్లక్ష్యం ఉండరాదని జాతీయ ఆరోగ్య నాణ్యత ప్రమాణాల ఢిల్లీ వైద్యాధికారులు బృందం సభ్యులు శ్రీరామ్ మోహంతి, సువర్ణ అబ్జే సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం కార్యక్రమంలో భాగంగా శనివారం చౌడాపూర్‌లోని పల్లె దవాఖానాను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం కింద ఎంపికైన ఉత్తమ పల్లె దవాఖానాకు మూడు సంవత్సరాల పాటు ఏటా 1.50లక్షలు అందుతాయని, ఈ నిధులను ఆస్పత్రి అభివృద్ధికి వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జీవరాజ్, మండల వైద్యాధికారి వాజుద్దీన్, వైద్యురాలు మాధురి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్, పల్లె దవాఖాన వైద్యురాలు ప్రశాంతి, సిబ్బంది చండీశ్వరి, అంజు, జ్యోతి, యాదమ్మ, జంగమ్మ, ఊర్మిల, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. 6వ తరగతిలో ప్రవేశాలకు, అలాగే 7 నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ఇంటింటికి వంద.. బడికి చందా' బాగుంది

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



కలెక్టర్ శశాంకకు జ్ఞాపిక అందజేస్తున్న మజీద్‌పూర్ వాసులు

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి గత పాలకవర్గం, గ్రామ ప్రజలు చేసిన కృషి అభినందనీయమని కలెక్టర్ శశాంక ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం 'ఇంటికి వంద.. బడికి చందా' అనే కార్యక్రమంతో ప్రజలందరిని భాగస్వాములను చేసి పాఠశాల నిర్మాణం కోసం నిధి తయారు చేయడం ఆలోచన బాగుందని కితాబిచ్చారు. శనివారం మజీద్‌పూర్ మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి కలెక్టర్ శశాంకను కలిశారు. పదిహేను నిమిషాల పాటు గ్రామం, పాఠశాల అభివృద్ధి గురించి కలెక్టర్‌కు వివరించారు. దాతల సహకారంతో రూ.15 లక్షలు నిధి సేకరించామని కలెక్టర్‌కు చెప్పారు. పాఠశాలకు సీఎస్ఆర్ నిధుల ద్వారా సహాయం అందిస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వందేమాతరం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రవీంద్రచారి, మాజీ వార్డు సభ్యులు గణేశ్ పాల్గొన్నారు.



పిల్లర్ స్థాయిలో ఆగిన చింతకుంట- ధారూరు వంతెన

'చింత' తీరేనా?

15 ఏళ్లుగా పిల్లర్ స్థాయిలోనే చింతకుంట వంతెన నిర్మాణం

- పనులు పూర్తయితే 18 గ్రామాలకు మెరుగైన రవాణా
- రోడ్డు సరిగ్గా లేకపోవడంతో చుట్టూ తిరిగి ధారూరుకు వస్తున్న జనం
- అధికారులదీ అదే తీరు..
- ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజల విన్నపం

ధారూరు: పాలకులు, అధికారుల నిర్లక్ష్యం 18 గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. చింతకుంట – ధారూరు గ్రామాల మధ్య కాగ్నా ఉప నదిపై 15 సంవత్సరాల క్రితం చేపట్టిన వంతెన నిర్మాణం పిల్లర్ దశ వీడటం లేదు. దీంతో 3 కిలోమీటర్ల ప్రయాణానికి 6 కిలోమీటర్లు తిరిగి ధారూరు చేరుకోవాల్సి వస్తోంది. 2010లో అప్పట్లో మంత్రి సబితారెడ్డి చింతకుంట–ధారూరు గ్రామా ల మధ్య కాగ్నా ఉప నదిపై వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ధారూరు నుంచి చింతకుంట గ్రామం వరకు బీటీ రోడ్డు వేశారు. కానీ వంతెన నిర్మాణంలో భాగంగా నాలుగు పిల్లర్లు వేసి ఆ తరువాత పనులను ఆపేశారు. దీంతో మండల కేంద్రానికి రావాలంటే చింతకుంట, మైలారం, కొత్తతండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గిరిజన సంక్షేమ శాఖ నిధులతో వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. పనులు అసంపూర్తిగా ఉండటంతో వర్షాలు పడిన ప్రతి సారీ పైగ్రామల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కాగ్నా ఉప నదికి ఇరువైపులా పొలాలు ఉండటంతో వర్షాలు పడినప్పుడు రైతులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. నది ఉధృతంగా ప్రవహించినప్పుడు జీవాలు కొట్టుకుపోయి మృత్యువాత పడుతున్నాయి. మైలారం– ధారూరు గ్రామాల మధ్య 18 గ్రామాలు ఉన్నాయి. మైలారం ప్రజ లు చింతకుంట మీదుగా ధారూరుకు రావాలంటే 8 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు సరిగ్గా లేకపోవడంతో మైలారం నుంచి నాగా రం మీదుగా అంపల్లి చౌరస్తా, దోర్నాల్, స్టేషన్ ధారూర్ మీదుగా 16 కిలో మీటర్లు ప్రయాణం చేసి ధారూరుకు వస్తున్నారు. దీంతో అదనంగా 8 కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శనివారం ధారూరులో వ్యవసాయ మార్కెట్, కూరగాయల మార్కెట్ జరుగుతుంది. 18 గ్రామాలకు చెందిన రైతులు, వ్యాపారులు, ప్రజలు సంతకు చుట్టూ తిరిగి వస్తున్నారు. అంతేకాకుండా వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రంలోని ప్రభుత్వ కా ర్యాలయాలకు వచ్చే వారు రవాణా పరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో సమయం, డబ్బు వృథా అవుతోందని ప్రజలు తెలిపారు. 18 గ్రామాల్లో దాదాపు 20 వేల మంది ఉన్నారు. చింతకుంట, మైలారం, కొత్త తండాల్లో 9వేల మంది ఉన్నారు. వీరందరూ సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రం.. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన చింతకుంట వంతెన నిర్మాణాన్ని ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'రేషన్' అక్రమాలకు చెక్

- చౌకధరల దుకాణాల్లో బినామీల ఏరివేతకు చర్యలు
- కొనసాగుతున్న సామాజిక తనిఖీలు
- నకాలంలో బియ్యం సరఫరా, ఈ–పాస్ వేలిముద్రలపై ఆరా

జిల్లాలో తెల్ల రేషన్ కార్డులు	-	2,14,485
అంత్యోదయ కార్డులు	-	26,865
రేషన్ దుకాణాలు	-	588



వికారాబాద్ అర్బన్: పేరు ఒకరిది.. దందా మరొకరిది. జిల్లాలో పలు రేషన్ డీలర్ల వ్యవహారం ఇది. ఏదైనా అవకతవకలు జరిగితే ఎవరిపై చర్య తీసుకోవాలో కొన్ని సార్లు సంబంధిత అధికారులకు తలనొప్పిగా మారింది. బినామీల చేతుల్లో డీలర్ షాపులు ఉండటంతో చాలా చోట్ల పౌరసరఫరాల బియ్యం పక్కదారి పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితి నుంచి బయట పడేందుకు ప్రభుత్వం బినామీ రేషన్ డీలర్లను గుర్తించే పనిలో పడింది. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని రేషన్ షాపులో సామాజిక తనిఖీలను చేపట్టాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించింది. దీంతో సివిల్ సప్లై అధికారులు తనిఖీలను ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ నాటికి తనిఖీలను పూర్తి చేసి రాష్ట్ర పౌరసరఫరాల శాఖకు నివేదిక సమర్పించనున్నారు. ఈ తనిఖీల్లో ఎవరైనా బినామీలు ఉంటే, బియ్యం సరఫరాలో సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ తనిఖీలు పూర్తి కాగానే జిల్లా సివిల్ సప్లై మానిటరింగ్ సమావేశాన్ని నిర్వహించి అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలపై చర్చించనున్నారు.

క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ

జిల్లాలో 19 మండలాల్లో కొన్ని రోజులుగా సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో అన్ని షాపుల్లో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రతి రేషన్ షాపును క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను తయారు చేస్తున్నారు. ప్రధానంగా రేషన్ దుకాణాన్ని సంబంధిత డీలర్లే నిర్వహిస్తున్నారా..?, లేక వేరే వ్యక్తి నడుపుతున్నాడా..?, డీలర్ మృతి చెందిన చోట ఆయన కుటుంబ సభ్యులు కాకుండా ఇతరులు నిర్వహిస్తున్నారా..? అనే వివరాలను తెలుసుకుంటున్నారు. నెలనెలా బియ్యం, ఇతర సరుకులు ఇచ్చే విషయంలో డీలర్ సమయపాలన పాటిస్తున్నారా..? తూకం సరిగ్గా వేస్తున్నారా..? బియ్యానికి డబ్బులు ఏమైనా వసూలు చేస్తున్నారా..? వంటి వివరాలు సేకరిస్తున్నారు. ఈ పాస్ యంత్రంలో వేలి ముద్రలను కూడా పరిశీలిస్తున్నారు.

బినామీలకు అప్పగించి..

జిల్లాలోని కొన్ని గ్రామాలు, పట్టణాల్లో కొందరు రేషన్ డీలర్లు బినామీలకు డీలర్ షిప్ అప్పగించి నెలనెలా కొంత డబ్బులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు ఇతర పనులు చేసుకుంటూ పట్టణాల్లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వాలు నిరుద్యోగులైన మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో 10వ తరగతి, ఆ పై చదివిన వారికి, మహిళా సంఘాల సభ్యులకు డీలర్ షాపులు కేటాయించాయి. ఇలాంటి చోట వారికి బదులుగా వారి కుటుంబ సభ్యులు, ఇతరులు షాపులను కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని చోట్ల యువతులు పేర్లపై రేషన్ షాపులు తీసుకున్నారు. చాలా మంది వివాహాలు చేసుకొని ఇతర గ్రామాలకు వెళ్లిపోయారు. ఆ షాపుల వివరాలు కూడా సేకరిస్తున్నారు.

క్షేత్ర స్థాయిలో తనిఖీలు



జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో సామాజిక తనిఖీలు జరుగుతున్నాయి. పూర్తి సమాచారం వచ్చాక పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. సివిల్ సప్లై డీటీల ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నాం. నిబంధనలు పాటించని రేషన్ డీలర్లపై చర్యలు తీసుకుంటాం.

– రాజేశ్వర్, డీఎస్‌ఓ, వికారాబాద్



అభివృద్ధి పనుల కోసం స్థలాల మ్యాప్‌ను పరిశీలిస్తున్న దాన కిషోర్

మహిళా సాధికారతకు కృషి

ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్

కొడంగల్ రూరల్: మహిళా సాధికారతకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ అన్నారు. శనివారం కొడంగల్‌లోని కడా కార్యాలయంలో నియోజకవర్గంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులపై వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్లు రాహుల్ శర్మ, మహంక్ మిట్టల్, కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఏయే పనులు చేపట్టాల్సి ఉందని దాన కిషోర్ అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఆయన మాట్లాడారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి, జీవనోపాధికి ఉపయోగపడేలా నైపుణ్య అభివృద్ధి యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు అభివృద్ధి పథంలో నిలవాలని సూచించారు. సంఘాల ద్వారా మహిళలు సభ్యులుగా చేరి ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. మహిళలు ఉన్నత చదువులు చదువుకుంటే వారి పిల్లలు ఉన్నత స్థానాల్లో నిలిచే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలను చదివిస్తూ వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలో చేపడుతున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులు, మార్కెట్ యార్డు తోపాటు వివిధ అభివృద్ధి పనులను, అవసరమైన స్థలాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో కలిసి మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బీ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, టౌన్ మిషన్ కోఆర్డినేటర్ వెంకటేశ్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాకు అన్యాయం

అసెంబ్లీ సమావేశాల్లో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. రైతు సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును రీ డిజైన్ పేరుతో తరలించి ఉమ్మడి జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పరిగి నియోజకవర్గ రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవిస్తారని తెలిపారు. పూర్తి మెట్ట పంటలు సాగే చేసే ఈ ప్రాంతానికి నీళ్లు తేవాలనే ఉద్దేశంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని ఒప్పించి ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పరిగి వరకు పొడిగించినట్లు తెలిపారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును రద్దు చేసి రైతుల నోట్లో మట్టి కొట్టిందన్నారు. కొందుర్గు లక్ష్మీదేవి ప్రాజెక్టు ద్వారా పరిగి, కొడంగల్ ప్రాంతాలకు సాగు నీరందిస్తామన్న అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్ని రోజులు ఏ ఒక్క పని కూడా ప్రారంభించ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పద్ధతి మార్చుకోవాలని సూచించారు. ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ నాయకులు కమీషన్లు తీసుకుంటున్నట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు.



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

వీరుల త్యాగాలతోనే విముక్తి

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు

అనంతగిరి: వీరుల త్యాగాలతోనే మనకు విముక్తి లభించిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ డాక్టర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం వికారాబాద్‌లోని సత్యభారతి గార్డెన్‌లో విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ హారతి ద్వారకానాథ్ రచించిన 'హైదరాబాద్ సంస్థానం విమోచనానికి.. ప్రాంతీయ బోధనకు పునాదులు వేసిన తెలంగాణ దార్శనికులు' అనే పుస్తకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికత, జ్ఞానం చాలా గొప్పవన్నారు. ఈ దేశం ఎంతో మంది మేధావులను, శాస్త్రవేత్తలను అందించిందన్నారు. చరిత్ర గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17న స్వాతంత్ర్యం వచ్చిందని, అదే మనకు నిజమైన స్వాతంత్ర్యమన్నారు. 1947 ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 17 మధ్యలో జరిగిన ఘటనలు, ఉద్యమాలను గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దివంగత కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ తెలంగాణ కోసం పార్లమెంట్‌లో తన గొంతుకను వినిపించారని తెలిపారు. తెలంగాణ కోసం పోరాడిన యోధులను గౌరవించాలన్నారు. ఒక స్ఫూర్తితోనే ఏ ఉద్యమమైనా ముందుకు సాగుతుందన్నారు.



పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు

భారతదేశానికి హైదరాబాద్ గుండెకాయ లాంటిదని జర్నలిస్టు షోయాబుల్లాఖాన్ చెప్పారని, నిజాం నిరంకు పాలనకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన షోయాబుల్లాఖాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ సంపూర్ణ అభివృద్ధికి ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలన్నారు. తాను కూడా ఒక పుస్తకం రాస్తున్నానని, అందులో ద్వారకానాథ్ గ్రంథం గురించి ప్రస్తావించనున్నట్లు చెప్పారు. వికారాబాద్ విద్యా హబ్ అని కొనియాడారు. అంతకుముందు పుస్తక రచయిత డాక్టర్ హారతి ద్వారకనాథ్ మాట్లాడారు. ఆంధ్రుల పాలనలో తెలంగాణ చరిత్ర నిర్లక్ష్యానికి గురైందన్నారు. తాను రాసిన పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాలని, గ్రంథ ప్రచురణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు రాష్ట్ర మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ దీప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణగౌడ్, సీనియర్ న్యాయవాదులు బస్వరాజు, గోపాల్‌రెడ్డి, విశ్రాంత అధ్యాపకులు లక్ష్మీనారాయణ, రిటైర్డు ఎంప్లాయిస్ జిల్లా సహ అధ్యక్షుడు బండెప్ప గౌడ్, ప్రముఖ కవి రాజలింగం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్, బీజేపీ రాష్ట్ర నాయకులు శివరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు రవీందర్‌రెడ్డి



షాద్‌నగర్: న్యూఢిల్లీలో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడికి సామ రవీందర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ అనుబంధ శివాజీ కొలాబరేషన్, శ్లైక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జనపథ్ రోడ్‌లో అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ రిసర్జెంట్ భారత్ ఆన్ గ్లోబల్ కాన్వాస్ అంశంపై ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే సదస్సుకు ఫౌండేషన్ నిర్వాహకులు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందరెడ్డికి శనివారం ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ... అంతర్జాతీయ సదస్సులో దేశంలో అమల్లోకి వస్తు న్న నూతన విద్యా విధానంపై ఇంప్లిమెంటింగ్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ, గవర్నెన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించబోతున్నట్లు తెలిపారు.అంతర్జాతీయ సదస్సుకు హాజరయ్యేందుకు తన పరిశోధన పత్రం ఎంపికవ్వడం ఆనందంగా ఉందన్నారు. రవీందర్‌రెడ్డిని పాలమూరు విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్, ప్రిన్సిపాల్ కమల అభినందించారు.

రాజీపడితే విజయం మీదే



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్

వికారాబాద్ అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీ పడితే ఇరువురూ విజయం సాధించినట్లేనని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ చైర్మన్ కే సుదర్శన్, జిల్లా అదనపు న్యాయమూర్తి సి.హెచ్. చంద్రకిషోర్ అన్నారు. శనివారం కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్చి 9న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ కేసుల్లో ఇరువర్గాలు రాజీ పడేలా కృషి చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. 498–ఏ, ఎక్సైజ్, డ్రంక్ అండ్ డ్రైవ్, గేమింగ్ యాక్ట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తి కే శ్రీకాంత్, జూనియర్ సివిల్ జడ్జి శ్రుతిదూత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధ్యానం చేస్తే.. ఆరోగ్యం మీ వెంటే



ధ్యానంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అంజనేయరెడ్డి

ధారూరు: నిత్యం ధ్యానం చేస్తే ఆరోగ్యం మీ వెంటేనని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ, ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా ఆంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త నవీన్‌లు అన్నారు. ధారూరు మండలం రాజాపూర్, మోమిన్‌ఖుర్దు, మోమిన్‌కలాన్, అంతారం, నాగారం గ్రామాల్లో ధ్యానంపై శనివారం విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తలనొప్పి, గుండె జబ్బులు, బీపీ, షుగర్, గుండె జబ్బులు లాంటివి ధ్యానం వలన నయం అవుతాయని పేర్కొన్నారు. ధ్యానం చేయడానికి ప్రతిరోజు కొంత సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ స్పిరిచువల్ సంస్థ సభ్యులు శోభిత, వేణు, గుండం శైలజ, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు

పూడూరు: భూ వివాదంలో దాడికి పాల్పడిన వ్యక్తులు ఎంతటివారైనా వదిలేదని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కోటిరెడ్డి హెచ్చరించారు. ఈ నెల 9న పూడూరు మండలం రాకంచర్ల గ్రామంలో పొలం హద్దుల వద్ద దాయాదుల మధ్య గొడవ జరిగిందని తెలిపారు. బాధితుడు యాదయ్య చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, అదే రోజున 324, 427 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని చెప్పారు. శనివారం బాధితులు ఎస్పీ కార్యాలయంలో కలిసి, దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరగా.. మెడికల్ రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

సాల్వీడులో చిరుత కలకలం

భయాందోళనలో గ్రామస్తులు



గుట్టప్రాంతంలో ట్రాక్ కెమెరాను ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ అధికారులు

కుల్కచర్ల: తమ పొలం పరిసర ప్రాంతంలో చిరుత కనిపించిందంటూ ఇద్దరు వ్యక్తులు.. గ్రామస్తులకు తెలపగా.. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అధికారులు చిరుత సంచార పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడా చిరుత ఆనవాళ్లు కనిపించలేదు. కానీ ఓ కుక్కపై గుర్తు తెలియని జంతువు దాడిచేసి, చంపి తిన్న ఘటన వెలుగు చూసినప్పటికీ.. చిరుత ఉందని అధికారులు నిర్ధారించలేక పోయారు. అయినప్పటికీ గ్రామస్తుల భయాన్ని పోగొట్టేందుకు ట్రాక్ కెమెరాను ఏర్పాటు చేశారు. అనంతరం అధికారులు మాట్లాడారు. గ్రామస్తులు ఎవరూ భయపడొద్దని, రాత్రి వేళలో ఒంటరిగా బయటకు తిరగొద్దని సూచించారు. పశువులను గ్రామశివారులోనే కట్టేసుకోవాలని చెప్పారు. చిరుత గురించి ఏదైనా తెలిస్తే.. సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామస్తులు మాట్లాడుతూ చిరుత సంచారంతో భయంగా ఉందని, దానిని బంధించాలని అధికారులను కోరారు.

కష్టాల సాగు



ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు

ఆరుగాలం శ్రమిస్తున్నా అన్నదాతలకు ప్రతిఫలం లేకుండా పోతోంది. పంటలకు పెట్టుబడి పెరుగుతున్నప్పటికీ, దిగుబడి అంతంత మాత్రమే వస్తోంది. ఎరువులు, పురుగుల మందులు, ఇంధన ఖర్చులు, కూలీల వ్యయం రైతన్నకు అదనపు భారంగా మారుతోంది. దీనికి తోడు మద్దతు ధర కూడా దక్కకపోవడంతో కర్షకులు.. అతి కష్టంగా సాగు చేస్తున్నారు.

ఏటా పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు

- రెట్టింపవుతున్న విత్తనాలు, ఎరువులు
- అదనంగా ఇంధన ఖర్చులు
- పరికరాల సబ్సిడీ లేక ఇబ్బంది

దౌల్తాబాద్: అన్నదాతకు వ్యవసాయం భారంగా మారుతోంది. ఏటా ఖర్చులు పెరిగిపోతున్నాయి. పెట్టుబడులకు సకాలంలో రుణాలు అందక, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అందక రైతులు అవస్థలు పడుతున్నారు. వ్యవసాయరంగంలో దశాబ్దకాలంగా యంత్రాల వినియోగం పెరుగుతూ వస్తోంది. వ్యవసాయ పరికరాల ధరలు గతేడాది కంటే 25 శాతం పెరగడం, యంత్రాల అద్దె రెట్టింపు కావడంతో సాగు భారంగా మారుతోంది. ఆధునిక వ్యవసాయ విధానంలో యంత్రాల వినియోగం తప్పనిసరిగా మారింది. కానీ యంత్రాల నిర్వహణకు అవసరమైన డీజిల్, పెట్రోలు ధరలు పెరుగుతుండడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. రోజురోజుకు పెరుగుతున్న చమురు ధరలు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపడంతో సన్న, చిన్నకారు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. యంత్రాల వినియోగం పెరిగి కూలీల సమస్య తగ్గినప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడి రాక రైతన్న దిగులు పడుతున్నారు.

యంత్రాలదే కీలకం

యంత్ర పరికరాలు లేనిదే పంటలు పండించలేని పరిస్థితి వచ్చింది. దుక్కిదున్నినప్పటి నుంచి పంట నూర్పిడి వరకు యంత్రాలు లేకుండా ఏ పనీ సాగడం లేదు. అయితే ఇవి నడవడానికి ఇంధనం తప్పనిసరి. డీజిల్ ధరలు పెరుగుతుండడంతో యంత్రాల యజమానులు ధరలు పెంచుతూ వస్తున్నారు. చేసేది లేక అధిక ధరను వెచ్చించి రైతులు భారంగా సాగుకు ఉపక్రమిస్తున్నారు.

పెరిగిన డీజిల్ ధరలు

డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ యజమానులు ధరలు పెంచేశారు. దుక్కి దున్నడానికి గంటకు రూ.1,200 ఉండగా ఇప్పుడు రూ.1,800 తీసుకుంటున్నారు. అలాగే వ్యవసాయ పరికరాల ధరలు విపరీతంగా పెరిగాయి. నూతన ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై పనిముట్లు ఇవ్వాలని, చమురు ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పార్లమెంట్‌లో తీర్మానం పెట్టాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో కులగణనను ఏకగ్రీవంగా తీర్మానించడం హర్షించదగిన విషయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం మాట్లాడారు. కులగణన తీర్మానం పార్లమెంట్‌లోనూ పెట్టాలని డిమాండ్ చేస్తూ.. ఆ దిశగా కేంద్రం ఆలోచించాలని సూచించారు.

మద్దతు ఇచ్చేవారికి మద్దతు

రాష్ట్ర ప్రభుత్వం బీసీ,ఎస్సీ,ఎస్టీ ఇతర వర్గాల అభ్యున్నతికి చేపట్టాల్సిన ప్రణాళికను సిద్ధం చేసిందని, ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కులగణన తీర్మానం చేపట్టిందని లాల్‌కృష్ణ తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీసీలు ఎంత ఆశగానో ఎదురుచూస్తున్న కులగణనకు ఎవరు ఏ మేరకు మద్దతు ఇస్తారో.. బీసీలంతా వారికి మద్దతుగా నిలుస్తారని పేర్కొన్నారు. కులగణనతో దేశంలో 50శాతం పైగా ఉన్న బీసీలకు ఉద్యోగ, రాజకీయ ఇలా అన్ని రంగాల్లోనూ వాటా పెరిగి, న్యాయం జరుగుతుందని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరిగిందని, అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే కాంగ్రెస్ కులగణన చేపట్టి, తీపి కబురు చెప్పిందన్నారు. కులగణన చేపట్టాలని సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో తాము ఢిల్లీలో సైతం నిరసనలు తెలిపామన్నారు. ఆయన కృషితోనే బీసీలకు న్యాయం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు హన్మంతు ముదిరాజ్, చిన్న నర్సింహులు, ఆంజనేయులు, పాలాద్రి శ్రీనివాస్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్ కృష్ణయ్య చిత్రాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీసీ నేతలు

సేవాలాల్ ఆశయసాధనకు కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

పరిగి: సంత్ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ సునితారెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని ఓ గార్డెన్‌లో సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహరాజ్ ఉత్సవ రథాన్ని ఊరేగించారు. అనంతరం బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్‌పర్సన్ మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ అని, గిరిజనులను ఒక్క తాటిపైకి తీసుకువచ్చిన మహనీయుడు ఆయన అని కొనియాడారు. గిరిజనులకు విద్య, వైద్యం అందించి, వారి పాలిట దైవంగా మారి, కొత్త జీవితాన్ని ప్రసాదించారని వెల్లడించారు. గిరిజనుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీతం మూరెడు.. పనిబారెడు!

- దినసరి కూలీకంటే తక్కువ జీతం
- చాలీచాలని వేతనాలతో వెతలు
- అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌పై చిన్నచూపు?
- అభద్రతా భావంతో విధుల నిర్వహణ



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్

కుల్కచర్ల: ఆశ్రమ విద్యార్థులకు అన్నీ తామై విద్యాబుద్ధులు నేర్పి, అండగా నిలిచే తమ భవిష్యత్తుకు భద్రత లేకుండా పోయిందని ఉపాధ్యాయులు తెలిపారు. 'అందరితో సమానంగా విధులు నిర్వహిస్తున్నాం. వేతనంలో తీవ్ర వ్యత్యాసం ఉంది. వాటితో కుటుంబ గడవడం సంగతి ఎలా ఉన్నా.. కనీస ఖర్చులకు సరిపోవడం లేదు. పని ఎక్కువగా చేయిస్తూ... జీతం మాత్రం ఇంత తక్కువగా ఇస్తున్నారు' అని అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయమై అధికారులకు అనేకసార్లు విన్నవించుకున్నామని, అయినా స్పందన లేదని వాపోతున్నారు.

జిల్లాలో 58మంది..

జిల్లా పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలో మొత్తం 58మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్, సుమారు 8 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు ఔట్ సోర్సింగ్ విధానంలో విధుల్లో చేరి, యేటా రెన్యూవల్ అవుతున్నారు. పాఠశాలలో అందరితో పాటు సమానంగా పనిచేస్తున్నారు.

దినసరి కూలీకి సరిపోదు

'విధుల్లో చేరిన మొదట్లో జీతం రూ.12వేలతో పాటు పీఎఫ్, ఇతర అలవెన్స్‌లు అదనంగా ఇస్తామని చెప్పారు. కానీ ప్రస్తుతం తమను థర్డ్ పార్టీ ఏజెన్సీకి అప్పగించారు. దీంతో ఇప్పుడు కేవలం రూ.7,370 జీతం మాత్రమే వస్తుంది' అని ఇన్‌స్ట్రక్టర్స్ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒక విద్యా వంటీర్‌కు ప్రభుత్వం రూ.12 వేల జీతం ఇస్తుందని, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా పనిచేస్తున్న మాకు ఇంత తక్కువ జీతం ఇవ్వడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఒక దినసరి కూలీకి ఇస్తున్న కూలీ డబ్బులకు కూడా తమ జీతం సరిపోదని వాపోయారు.

తమను గుర్తించాలి



అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా పనిచేస్తున్న తమకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలి. పాఠశాలల్లో పనిచేస్తున్న కొందరిని సీఆర్టీలు(కాంట్రాక్ట్ రెసిడెన్సియల్ టీచర్స్)గా గుర్తించి, వారికి రూ.29వేలు చెల్లిస్తున్నారు. అదే విధంగా ఉపాధ్యాయులకు చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు.. ఇతర అలవెన్సులను ఇవ్వాలి. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించాలి.

– రాజేందర్, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్స్ సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

- ముగ్గురికి తీవ్రగాయాలు
- 22మందిపై కేసు నమోదు



ఘర్షణలో గాయపడిన పాండు, జామ్లా

కుల్కచర్ల: భూ సరిహద్దుల అంశంలో ఇరువర్గాలు మధ్య ఘర్షణ జరిగిన సంఘటన కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈర్లవాగు తండా గ్రామపంచాయతీ హర్యానాయక్ తండాకు చెందిన కేతావత్ రమేష్, అతని సహచరులు శనివారం తన పొలంలో విరగగొట్టబడున్న కడ్డీలు(కంచె స్తంభాలు)లను సరిచేస్తున్న క్రమంలో.. మీరు కడ్డీలు వేసిన ప్రాంతం మా సర్వే నంబరులోకి వస్తుందని భానవత్ రాజేష్, అతని సహచరులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాటలు, కర్రలతో దాడులు చేసుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, వారిని చెదరగొట్టారు. ఈ దాడుల్లో పాండు, రమేష్, జామ్లాలకు తీవ్రగాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనపై ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు ప్రాథమికంగా 22మందిపై (రమేష్ ఫిర్యాదు మేరకు రాజేష్, పాండు, చందర్‌తో పాటుగా మరో 9మందిపై కేసులు నమోదు చేయగా.. రాజేష్ ఫిర్యాదు మేరకు రమేష్, జామ్లా, లాలు, రవి, సురేష్‌తో పాటు మరో ఐదుగురిపై) కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

తలకొండపల్లి: వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో వెలుగు చూసింది. ఎస్ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన రవి(30) ఈ నెల 14వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కానీ ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఆందోళన కుటుంబ సభ్యులు.. తెలిసిన వారందరినీ విచారించారు. కానీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో రవి అన్న కుమార్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిధుల విడుదలపై హర్షం



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

నవాబుపేట: జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలానికి రూ.2.10 కోట్ల నిధులు మంజూరు చేసిన ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్ కుమార్ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్ భరత్ సహకారంతో జిల్లా మంత్రి, స్పీకర్ మండలానికి నిధులు విడుదల చేశారని తెలిపారు. మంజూరైన నిధులను గ్రామపంచాయతీ భవనాలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు కేటాయించినట్లు చెప్పారు. మండలంలోని ప్రతి గ్రామానికి రూ.10 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, సామ వెంకటరెడ్డి, ఇక్బాల్, గోపాలకృష్ణ, మల్లేశం తదితరులు ఉన్నారు.

నాపరాతి పరిశ్రమను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రభుత్వాన్ని కోరిన క్వారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు

తాండూరు: నాపరాతి పరిశ్రమను ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడాలని బయటపడేయాలని తాండూరు క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ రవూఫ్, జుబేర్‌లాలు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక స్టోన్‌భవన్‌లో అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నాపరాతి వ్యాపారులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించడం హర్షణీయమన్నారు. రెండేళ్లుగా నాపరాతి పరిశ్రమలపై ప్రభుత్వం పన్నుల భారం మోపడంతో ఆర్థికంగా చితికిపోతున్నామని, గనుల లీజు పొందాలంటే రూ.18 లక్షల భారం పడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. టైల్స్, మార్బుల్స్‌కు డిమాండ్ పెరగడంతో ఇక్కడి నాపరాతికి డిమాండ్ తగ్గిందని వాపోయారు. నాపరాతిపై కర్ణాటక ప్రభుత్వం మైనింగ్ లీజులు సులభతరం చేసిందని, రాయల్టీ పన్ను రూ.800 మాత్రమే వసూలు చేస్తుందని వివరించారు. పరిశ్రమ ద్వారా ఇక్కడ 20వేల మందికి పైగా ఉపాధి పొందుతున్నారని స్పష్టంచేశారు. కానీ గని నిర్వాహకులకు మాత్రం ఆదాయం రావడం లేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ జిల్లా నేతలు కావడంతో సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఓం ప్రకాశ్‌సోమాని, సంయుక్త కార్యదర్శి నర్సింహులు, ప్రతినిధులు హబీబ్‌లాల, అన్వర్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నందిగామ: చంద్రాయన్‌గూడ సమీపంలో పాత జాతీయ రహదారిపై కారు బోల్తాపడిన ఘటనలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. షాద్‌నగర్‌కు చెందిన వజీర్ రెండు రోజుల క్రితం హైదరాబాద్ వైపునకు కారులో అతివేగంగా ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి బోల్తాపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నగరంలోని ఓ ఆసుపత్రిలో వజీర్ చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచాడు.

తాళం వేసిన ఇళ్లే అతడి టార్గెట్

- ఉన్నదంతా ఊడ్చేసి ఉడాయింపు
- అంతర్‌జిల్లా దొంగ అరెస్టు
- 30.3 తులాల బంగారం, 1.40కిలోల వెండి, మూడు బైకుల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: తాళం వేసిన ఇళ్లే అతడి టార్గెట్. పగలంతా పసిగట్టి, రాత్రి వేళలో కన్నమేసి, ఉన్నదంతా ఊడ్చేయడమే అతని హాబీ! ఇలా వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన అంతర్జాతీయ దొంగని శనివారం జిల్లా పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్పీ కోటిరెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఉదయం 5గంటలకు నవాబ్‌పేట మండలం పులుమామిడి గేట్ వద్ద పక్కా సమాచారంతో మోమిన్‌పేట సీఐ ఆంజనేయులు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంతయ్య, నవాబ్‌పేట ఎస్ఐ భరత్ భూషన్ ఇతర సిబ్బంది కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో టీఎస్15ఈడబ్ల్యూ5516 యూనికాన్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి.. పోలీసులను చూసి పారిపోవడానికి యత్నించారు. అతడిపై అనుమానం వచ్చి పట్టుకుని సోదా చేయగా.. బంగారం, వెండి ఆభరణాలు లభ్యమయ్యాయి. వీటిపై సదరు వ్యక్తి పొంతనలేని సమాధానం చెప్పడంతో పోలీసులు తమదైన శైలిలో విచారించగా.. అసలు విషయం బయటపడింది.

దొంగతనాలను వృత్తిగా..

సూర్యాపేట జిల్లా హుజురానగర్ మండలం కరక్కాయల గూడెంకు చెందిన సన్నిధి ఆంజనేయులు మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈజీగా డబ్బుల సంపాదనకు అలవాటు పడి, దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ నెల 7న నవాబ్‌పేట మండలం వట్టి మీనపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి, బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.60వేల నగదును అపహరించాడు. గతేడాది డిసెంబర్ 11న వికారాబాద్ పట్టణం అస్సాం బేకరి సమీపంలో తాళం ఉన్న ఇంట్లో ఆభరణాలను దొంగిలించాడు. నల్గొండ జిల్లా కోదాడలో నాలుగు చోరీలకు పాల్పడ్డాడు.

సొత్తు విక్రయించేందుకు వెళ్తూ..

దొంగిలించిన సొత్తు విక్రయించేందుకు నవాబ్‌పేట మండలం పులుమామిడి గేట్ మీదుగా వికారాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో ఆంజనేయులు పోలీసులకు పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకుని విచారించగా అతడిపై ఇదివరకే 36 (నల్గొండలో 25, ఖమ్మం 4, వరంగల్4, సిద్దిపేట 2, సంగారెడ్డి జిల్లాలో ఒకటి) దొంగతనం కేసులున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు వికారాబాద్‌లో 1, నవాబ్‌పేటలో 1, కోదాడలో 4 కేసుల్లో మొత్తం 6 కేసుల్లో అరెస్టు నిందితున్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన నిందితుడి నుంచి మొత్తం 30.3 తులాల బంగారం, 1.40కిలోల వెండి, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన మోమిన్‌పేట సీఐ అంజనేయులు, సీసీఎస్ సీఐలు బల్వంతయ శ్రీను, నవాబ్‌పేట ఎస్ఐ భరత్ భూషన్, ఇతర సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. సమావేశంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ టి.శ్రీను పాల్గొన్నారు.